# విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : ఎంపీ మల్లురవి

**లింగాల, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని నాగర్ కర్నూల్ ఎంపీ డా. మల్లురవి అన్నారు. గురువారం లింగాల మండల శివారులోని రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్యను అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలో, హాస్టల్ లో సన్నబియ్యంతో కూడిన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం మండల పరిధిలోని అంబట్ పల్లి గ్రామంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, రాష్ట్ర శ్రీనివాసరావు, నాగరవి, శంకర్, ఉల్లంగోడ్ల రాజు, ముక్తార్, ఇందిరమ్మ, విజయలక్ష్మి ్మ, డిటిడిఓ ఫిరంగి, ఆర్డీఓ మాధవి, తహసిల్దార్ పాండు నాయక్, ఎంపిడిఓ చంద్రశేఖర్, ఎస్టీ హాస్టల్ వార్డెన్ సనాతన బాలస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.



గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు శంకుస్థాపన చేస్తున్న నాగర్ కర్నూల్ ఎంపీ డా. మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ.

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



మొక్క నాటుతున్న ఎంపి డికె అరుణ

### దీన దయాళ్ జీవితం
# అందరికీ ఆదర్శం
### ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుదాం : ఎంపి.డికె.అరుణ

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** బిజెపి వ్యవస్థాపకులు పండిట్ దీన దయాళ్ జీవితం అందరికీ ఆదర్శం అని ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుదాం అని పాలమూరు ఎంపి డికే అరుణ, బిజెపి రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ అన్నారు. గురువారం సేవా పక్షంలో భాగంగా దిన దయాళ్ జయంతిని ఘనంగా నిర్వ హించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సభలో వారు మాట్లాడుతూ దిన దయాళ్ జీవితం ఆదర్శం అని ఆయన ప్రజల కోసం, దేశం కోసం ముఖ్యంగా అంత్యోదయ చిట్టచివరి పేద వ్యక్తికి సంక్షేమం అందాలని తాపత్రయ పడ్డారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో నేడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ పని చేస్తు పేద ప్రజల సంక్షేమం కోసం అట్టడుగు స్థాయి వరకు సంక్షేమ పథకాలను అమలు – మిగతా3లో..



ఈవీఎం గోదాములో త్రైమాసిక తనిఖీ నిర్వహించిన కలెక్టర్

### ఈవీఎంలకు
# కట్టుదిట్టమైన భద్రత

**నారాయణ పేట, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఈవీఎంల గోదాము కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. గురువారం కొత్త బస్ స్టాండ్ ముందు గల ఈవీఎం గోదాములో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీను పాల్గొని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలసంఘం మార్గదర్శకాల ప్రకారం ఎప్పటికప్పుడు –మిగతా3లో..



బతుకమ్మకు పూజ చేస్తున్న కలెక్టర్ సంతోష్

### జిల్లా కలెక్టరేట్‌లో
# బతుకమ్మ వేడుకలు

**గద్వాల టౌన్ సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతను, మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. గురువారం ఐ.డి.ఓ.సి ఆవరణలో ఏర్పాటుచేసిన బతుకమ్మ సంబరాలలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌరీమాత పూజ నిర్వహించి, బతుకమ్మ వేడుకలను అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు రంగు రంగుల బతుకమ్మలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. బతుకమ్మ వేడుకల శుభాకాంక్షలు తెలియజేస్తూ బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రజల బ్రతుకులు బాగుండాలని గౌరమ్మ తల్లిని వేడుకుందామన్నారు. మన పండుగ, మన సంస్కృతి ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక ఈ బతుకమ్మ అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే ఏకైక పండుగ బతుకమ్మ అని తెలిపారు. బతుకమ్మ పండుగ మన వారసత్వాన్ని కాపాడే గొప్ప పండుగ అని అన్నారు. బతుకమ్మ పండుగ ఉత్సవాల అనంతరం, జిల్లా కలెక్టరేట్‌కు చెందిన మహిళా అధికారులు సంతోషంగా బతుకమ్మలను చేతబెట్టుకుని కలెక్టరేట్ కార్యాలయం నుండి తేరు మైదాన్‌కు వెళ్ళడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్.డి.ఓ అలివేలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# కిక్ తగ్గనుందా..?



### నేటి నుంచి మద్యం టెండర్లు షురూ..

| ముఖ్యమైన తేదీలు.. | | |
|---|---|---|
| | నోటిఫికేషన్ జారీ | 26.10.2025 |
| | దరఖాస్తుల స్వీకరణ | 26.09.2025 |
| | గడువ తేదీ | 18.10.2025 |
| | డ్రా తేదీ | 23.10.2025 |
| మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లింపు | | 23,24వ తేదీలు.10.2025 |
| | నూతన షాపుల ఓపెన్ | 01.12.2025 |

**ఎక్సైజ్ నూతన పాలసీపై కొంత నిరాసక్తత కనిపిస్తున్నట్లు తెలుస్తున్నది. అందుకు ప్రధాన కారణం ఈ ఏడాది నుంచి దరఖాస్తు రుసుము (డీడీ) రూ.3లక్షలకు పెంచడమే. మద్యం పాలసీ 2023-25కు సంబంధించి నవబంబర్ 30తో గడువు ముగియనున్నది. దీంతో నూతన మద్యం పాలసీకి సంబంధించి నేటి నుంచి దరఖాస్తులను స్వీకిరించేందుకు అధికారం యంత్రాంగం నోటిఫికేషన్ విడుదల చేసింది. సర్కార్‌కు ఆదాయం తెచ్చిపెట్టే ప్రధాన శాఖల్లో ఎక్సైజ్ శాఖ కీలకం. అయితే ఈ ఏడాదిలోనిప స్థానిక ఎన్నికలు ఉండడం కొంత ఆసక్తి పెంచుతున్నా దరఖాస్తు రుసుము లక్ష పెంచడం కొంత టెండర్‌దారులు అంతర్మథనంలో పడ్డారు.**

*- మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 25, ప్రభాతవార్త*

- ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షల రుసుము
- టెండర్‌దారుల్లో స్వల్ప నిరాసక్తత
- 2025-27 ఎక్సైజ్ పాలసీకి దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 30తో ముగియనున్న గడువు
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో నాలుగు ఎక్సైజ్ డివిజన్లు, 14 సర్కిళ్లు

గత2023 డిసెంబర్1 నుంచి ప్రారంభమైన మద్యం దుకాణాల కాలపరిమితి రెండేండ్లకు ఉంటుంది. ఇందులో భాగంగా2025నబంవర్ 30వతారీఖు నాటికి మద్యం పాలసీ ముగుస్తుంది. ఈ క్రమంలో మరోసారి టెండర్లు నిర్వహించి నూతన మద్యం దుకాణాలకు అనుమతి ఇవ్వాల్సి ఉన్నది. పాలసీగడువు ముగింపునకు మరో రెండు నెలలు మాత్రమే ఉండడంతో మద్యం వ్యాపారుల్లో టెన్షన్ నెలకొన్నది. ఈక్రమంలో సర్కారు వారికి శుభవార్త తెలిపింది. శుక్రవారం నుంచి నూతన టెండర్లకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది. నూతన మద్యం పాలసీకి సంబంధించి ఉమ్మడిజిల్లాలో ఆసక్తికర గత కొంతకాలంగా చర్చ కొనసాగింది. స్థానికల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పాత మద్యం పాలసీకి సంబంధించిన గడువు పొడిగిస్తారా...నిర్వహిస్తారా అని.. అయితే ఈలోపే నోటిఫికేషన్ విడుదలచేసి మద్యంటెండర్‌దారులకు మరింత ఉత్సాహ పరిచినా..లక్షరూపాయల రుసుము పెంచడంతో కొత్త చర్చకు దారితీసింది. రూ.3లక్షలకు పెంచినా మూడేండ్ల కాలపరిమితి పెంచుతారని విషయాలు చర్చనీయాంశమైంది. అయితే సర్కారు ఆ అవకాశం కల్పించలేదు. గతంలో మాదిరి రెండేండ్ల కాలపరిమితితోనే టెండర్లు కేటాయించి రుసుము మాత్రం ఒక్కో దరఖాస్తు డీడీకి రూ.3లక్షలు కేటాయించింది. టెండర్ దారులకు 21ఏండ్లు నిండాలి. ఒకవ్యక్తి ఎన్నిషాపులకైనా దరఖాస్తుచేసుకోవచ్చు. గతంలో 4స్లాబుల్లో లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉండగా నూతన మద్యం పాలసీ ద్వారా 6స్లాబుల్లో లైసెన్స్ ఫీజు చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు.

**రిజర్వేషన్ ఇలా..**

ఎస్సీ, ఎస్టీ, గౌడ కులస్తులకు కేటాయించిన షాపుల్లో మాత్రం ఆ కేటగిరీలకు చెందిన వారే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఎస్టీలకు 5శాతం, ఎస్సీలకు 10శాతం, గౌడ్లకు 15శాతం చొప్పున రిజర్వేషన్ అమలు చేస్తూ గతంలో ఉత్తుర్వులు జారీ అయ్యాయి. వారు దరఖాస్తుతోపాటు కుల ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది.

**ఉమ్మడి జిల్లాలో 14 సర్కిళ్లు..**

ఉమ్మడిజిల్లాలో మొత్తం నాలుగుడివిజన్లు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల ఉన్నాయి. జడ్చర్ల, కోస్గి, మహబూబ్‌నగర్, నారాయణపేట, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ తెలకపల్లి, ఆత్మకూరు, కొత్తకోట, వనపర్తి, అలంపూర్, గద్వాల కలిపి 14 సర్కిళ్లున్నాయి. అయితే మద్యం టెండర్ రుసుము విషయంలో లక్ష పెంచడంతో ఏమైనా మార్పులు వస్తారా... ఈ ప్రభావం టెండర్లపై ఉంటుందా..లేదా అంటే మరి కొన్ని రోజులు చూడాలి.



దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవరోజు ఐదో శక్తిపీఠం జోగులాంబ ఆలయంలో కుష్మాండ దేవీగా అమ్మవారు భక్తులకు దర్శమిచ్చారు.
( అలంపూర్ , సెప్టెంబరు24,ప్రభాతవార్త )

# అక్రమ నిర్మాణం కూల్చివేత..!

**చిన్నంబావి, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** చిన్నంబావి మండల కేంద్రంలో జూరాల ఎడమ కాలువ డి36 మైనర్ 6ఆర్ కాల్వపై అక్రమంగా నిర్మించిన షాపులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గురువారం జెసిబితో కూల్చి వేశారు. మండల కేంద్రం కావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో వనపర్తి పట్టణానికి చెందిన ఒక వ్యాపారవేత్త సర్వేనెంబర్ 163, 191లో సుమారు నాలుగు ఎకరాలు వెంచర్ వేయడం జరిగింది. సర్వే నెంబర్ 191లో జూరాల మైనర్ కాలువ పోవడం జరిగింది. మైనర్ కాలువలో సిమెంట్ పైపులు వేసి దానిపై మట్టి పూడ్చి ఎలాంటి అనుమతి లేకుండా 12 షాపులతో కూడిన వ్యాపార సముదాయాన్ని గత ఐదేళ్ల క్రితం నిర్మించాడు. దీంతో కొందరురైతులు అతనిపై పలుసార్లు ఇరిగేషన్ అధికారుల కు ఫిర్యాదు చేశారు. స్పందిం చిన అధికారులు రెండు, మూడుసార్లు నోటీసులు జారీ చేశారు. నోటీసులకు ఎలాంటి స్పందన లేకపోవడంతో గురువారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో కూల్చివేయడం జరిగింది. కూల్చివేతలపై తహసిల్దార్ కె. శ్రీనివాసులును వివరణ కోరగా తెలంగాణ భూ అక్రమణ చట్టం 1905 ప్రకారం, అలాగే ఇరిగేషన్‌శాఖా ద్వారా భూసేకరణ –మిగతా3లో..

**భూ ఆక్రమణ చట్టానికి విరుద్ధంగా నిర్మాణం**



అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న దృశ్యం

### ఒక్కటీ పెండింగ్
# ఉండొద్దు

- దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి
- కలెక్టర్ విజయేంద్రబోయి ఆదేశం
- తహసీల్దార్లతో సమావేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు25, ప్రభాతవార్త:** భూ భారతి, రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన పెండింగ్ దరఖాస్తులను పరిష్కారంకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌లను జిల్లా కలెక్టర్ –మిగతా4లో..



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

### జడ్చర్ల మున్సిపాలిటీకి
# రూ.12.5కోట్లు

- అభివృద్ధి పనులకు నిధులు ఇచ్చిన ప్రభుత్వం
- ఈ నిధులతో రోడ్లు, డ్రైన్ల పనులు చేపడతాం
- మరిన్ని నిధులను పట్టణానికి తీసుకొస్తాం
- పాత బజారుతో సహా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** జడ్చర్ల పట్టణం పరిధిలో రోడ్లు, డ్రైన్లు, ఇతర అభివృద్ధి పనులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూ.12.5 కోట్లు మంజూరు చేసిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఆర్.టీ నెంబర్ 541 ను జారీ చేసినట్లు తెలిపారు. ఇవి కాకుండా మున్సిపాల్టీకి మరిన్ని నిధులు మంజూరు చేసే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని చెప్పారు. జడ్చర్ల పట్టణంలో సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, పార్కుల అభివృద్ధి పనుల కోసం పంపిన ప్రతిపాదనల్లో భాగంగా ప్రస్తుతం రూ.12.5 కోట్లు మంజూరు అయ్యాయని గురువారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఇవి కాకుండా పట్టణ పరిధిలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టడానికి మరో రూ.12.5 కోట్ల ప్రతిపాదనలు కూడా పంపడం జరిగిందని ఈ నిధులు కూడా మంజూరు చేయించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధి కోసం రూ.70 కోట్లు మంజూరు చేయాలని గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరడం జరిగిందని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని వివరించారు. ఈ నిధులన్నీ మంజూరైతే జడ్చర్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. గత ఏడాదిలో టీయుఎఫ్ ఐడిసి పథకం కింద రూ.22 కోట్లు మంజూరు అయిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఈ నిధులతో పట్టణంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైన్ల పనులు కొనసాగుతున్నాయని, ఇదే నిధులతో చేపట్టనున్న వరద కాల్వలు (స్టామ్ వాటర్ డ్రైన్స్) కు సంబంధించిన టెండర్ పనులు పూర్తి కాగా, వీటికి సంబంధించిన నిర్మాణ –మిగతా3లో..

### పెన్షన్ల పెంపుకై
# నిరవధిక దీక్ష..

- అక్టోబర్ 6 నుండి నవంబర్ 6 వరకు అన్ని మండల కేంద్రాల్లో
- పెన్షన్లు పెంచకుండా సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం
- ప్రజల తరపున కొట్లాడాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ కనిపించడం లేదు
- దేవరకద్రలో జరిగిన పెన్షన్ల పెంపు సభలో మందకృష్ణ ఘాటు విమర్శలు

**దేవరకద్ర, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలో పెన్షన్లు పెంచాలని గురువారం నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంబడే 10లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని, వికలాంగులకు రూ.6000 పెన్షన్, చేయూత పెన్షన్ రూ.4000 పెంచుతామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ 22 నెలలు అవుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెన్షన్లు పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అక్టోబర్ 6 నుండి –మిగతా3లో..



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

# ఈనెల 29న జిల్లాలో మంత్రుల పర్యటన

- రూ.91.71కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం
- మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి
- కొండారెడ్డిపల్లి గ్రామాభివృద్ధి అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**కల్వకుర్తి, సెప్టెంబర్25 ప్రభాతవార్త:** ఈ నెల 29వ తేదీ సోమవారం జిల్లాలో రాష్ట్ర మంత్రుల పర్యటన విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్‌సంతోష్ సంబంధితఅధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని వంగూర్ మండలానికి చెందిన కొండారెడ్డిపల్లి గ్రామాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.91.71కోట్లు (రూ.9,171 లక్షలు) రూపాయల అంచనా వ్యయంతో 18రకాల అభివృద్ధిపనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈఅభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన లను రాష్ట్ర మంత్రులు ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకాటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డిలు మరియు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారు. గురువారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లాఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్, అభివృద్ధి పనుల ప్రత్యేక అధికారి దేవ సహాయంలతో కలిసి కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలని, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి శాఖ కృషి చేయాలని ఆదేశించారు. గత నెలలుగా కొన్ని శాఖలు చురుకుగా పనులు పూర్తి చేసినందుకు ఆయా శాఖల అధికారులను జిల్లాకలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. మంత్రుల పర్యటనలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రోటోకాల్ సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పనుల పురోగతి వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా పాల శీతలీకరణ కేంద్రం ప్రారంభోత్సవం, నూతనంగా ఏర్పాటుచేసిన బ్యాంక్ ప్రారంభం, చిల్డ్రన్స్ పార్క్, వ్యాయామశాల, ఆర్ఎంపీ రోడ్డు వంటి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, అదనంగా చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు అందే సౌకర్యాలు అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉండేలా ప్రతి శాఖ అధికారి ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా కొండారెడ్డిపల్లి గ్రామం సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఘనంగా పండిట్ దీన్ దయాల్ జన్మదిన వేడుకలు



పండిత్ దీన్‌దయాల్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** శ్రీరంగాపురం మండలంలోని అన్ని గ్రామాలలో భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు పండిట్ దీన్ దయాల్ జన్మదినం సందర్భంగా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర చిత్రపటానికి పూలమాలలు వేసి వారి పేరుపై మండలంలోని అన్ని గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమం శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ నాయుడు ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది. కార్యక్రమానికి మండల ఇన్చార్జి పురుషోత్తం రెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ సీనియర్ నాయకులు రాములు యాదవ్, మండల సేవా పక్షం కన్వీనర్ విరాట్ నాయుడు సోషల్ మీడి యా కన్వీనర్ చరణ్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లస్వామి ,మండల ఓబీసీ ప్రెసి డెంట్ మధు నాయుడు, శక్తి కేంద్ర ఇంచార్జ్ భాస్కర్, మండల కోశాధికారి రాముడు, ఉపాధ్యక్షు డు లక్ష్మీ ్మనారాయణ, బూత్ అధ్యక్షులు వెంకటేష్, రాజేష్ నరసింహ, ఎల్లస్వామి, శివయ్య పాల్గొనడం జరిగింది.

## నేడు సర్వసభ్య సమావేశం

**ఉప్పునుంతల, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉప్పునుంతల సర్వసభ్య సమావేశం నేడు శుక్రవారం ఉదయం 11.30 గంటలకు సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు అధ్యక్షతన సర్వ సభ్య (మహాజన సభ) నిర్వహిస్తున్నట్లు సంఘ సీఈఓ కొత్త రవీందర్ రావు తెలిపారు. ఈ సమావేశంలో 1.04.2025 నుంచి 25.09.2025 వరకు సంఘం జరిపిన సంఘం యొక్క లావా దేవిలు (జమ ఖర్చులు)అమెదించుట గురించి 01.10.2025 నుంచి 31.03.2026 వరకు సంవత్సరంనకు అంచనా బడ్జెట్ ఆమోదించుట గురించి, అధ్యక్షుల వారి అనుమతితో ఇతర విషయాలు చర్చించుట గురించి ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘ సీఈఓ వివరించారు. ఈ సర్వసభ్య సమావేశానికి సంఘ సభ్యులు, పాలక మండలి సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

## పండిత్ దీన్ డయల్ జయంతిలో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి



దీన్ దయాల్ జయంతి ఉత్సవంలో బిజెపి నాయకులు

**పెబ్బేరు, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ పెబ్బేరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగు సేవా పక్షంలో భాగంగా మహనీయుడు భారతీయ జన సంఘం 10 వ అధ్యక్షుడు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మహనీయునికి స్థానిక సుభాష్ చంద్రబోస్ చౌరస్తా నివాళులు అర్పించి అనంతరం నివాళిగా ప్రతి వార్డు నందు రెండు మొక్కలు నాటుతూ నివాళులు అర్పించారు. భారతీయ జన సంఘ్ నుంచి ఏర్పడిన భారతీయ జనతా పార్టీ ప్రజల కోసం ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న అన్ని రకాల పథకాలను ప్రజల్లో వివరిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించడం జరిగింది. కార్యక్రమంలో భాగంలో వార్డు నిద్రలో భాగంగా5,6,7 వార్డులలో జిల్లా జడ్పీ మాజీ జెడ్ చైర్పర్సన్ రాకాసి లోక్‌నాథ్ రెడ్డి ఇక్కడి నిద్రచేసి ఉదయం నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గౌని హేమారెడ్డి, పట్టణ అధ్యక్షులు కావలి క్రాంతి కుమార్, కంచ ఆంజనేయులు, సర్వేశ్వర్ గౌడ్, మోతీ రాఘవేంద్ర, కార్తీక్ చారి, బలరాం తదితరులు పాల్గొనడం జరిగింది.

## హెచ్‌ఐవి ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత ప్రదర్శన

**ఊట్కూర్,సెప్టెంబరు25 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జయచంద్ర మోహన్ ఆధ్వర్యంలో వెన్నెల కల్చరల్ అకాడమీ కళాకారులు గురువారం ఊట్కూర్ బస్టాండు దగ్గర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల దగ్గర హెచ్‌ఐవి ఎయిడ్స్ నియంత్రణపై కళా ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది. ఈ ప్రదర్శనలో కళాకారులు పల్లె శుద్ధుల ద్వారా ప్రజలకు హెచ్‌ఐవి పట్ల హెచ్‌ఐవి సోకే మార్గాలను వివరించారు హెచ్‌ఐవి కలుషిత సూది సిరంజిల ద్వారా కలుషితమైన రక్తమార్పిడి ద్వారా, అసురక్షి త లైంగిక సంబంధాల వల్ల హెచ్‌ఐవి సోకిన తల్లి నుండి బిడ్డకు సోకుతుందని అవగాహన కలిగించారు. హెచ్‌ఐవి రాకుండా యువతి యువకులు పెళ్లికి ముందు బ్రహ్మచర్యం పాటించాలని పెళ్లి తర్వాత భార్యా భర్తలిద్దరూ ఒకరిపై ఒకరు నమ్మకంగా జీవించాలన్నారు. అనుకోని పరిస్థితుల్లో అసురక్షి త లైంగికంగా పాల్గొనాలంటే కండోమ్ వాడాలని సూచించారు. హెచ్‌ఐవి పట్ల ఏమైనా అనుమానాలు ఉంటే 1097 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి అనుమానాలు తీర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సత్యం ప్రకాష్ రెడ్డి, శ్రీధర్, వెన్నెల కల్చర్ల అకాడమీ డైరెక్టర్ రవిశంకర్, నరసింహ, చెన్నయ్య, వెంకటేష్, యూసీస్, ఎంపీడీవో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నరసింహులు, అశ్విని కృష్ణ, నోవా, లక్ష్మణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

25ఎంబిఎన్ఆర్ 17: కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## కాంగ్రెస్ ప్రభుత్వ వైపల్యం వల్లే రైతులకు యూరియ తిప్పలు : బీఆర్ఎస్ ఆగ్రహం

**ఊట్కూర్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండలంలోని రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు అవసరమైన సకాలంలో ఎరువులు అందక రైతాంగం ఆందోళన చెందుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. రైతులకు కావలసినంత యూరియాను తక్షణమే పంపిణీ చేసి, అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, యూరియా పి.ఎ.సి.యస్ ద్వారా సరఫరా చేస్తే రైతులకు మరింత సౌకర్యం కలుగుతుందని సూచించారు. ఈ సమస్యలపై స్పందించాలని కోరుతూ ఊట్కూర్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి గణేశ్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, కోరం శివరాజ్ రెడ్డి, వడ్ల గంగాధర్ చారి, చింతన్ పల్లి భాస్కర్, సుధాకర్, ఎండీ ఖాలీక్, సమ్మీ హుల్లా, వడ్ల మోనప్ప, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ నుండి ఎంపీడీవోగా పరశురాముడు



**అలంపూర్ సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామానికి చెందిన పరుశురాముడు తన పేద కుటుంబంలో జన్మించి ఉద్యోగం సాధించాలని పట్టుదలతో మొదటి నుండి విద్యపై దృఢ సంకల్పంతో విద్యను అభ్యసించి పేద తల్లిదండ్రులైన వారికి తన విద్యతో పట్టుదలతో ముందుకు వెళ్లి ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకొని ప్రభుత్వ ఉద్యోగం పై దృష్టి సారించడం జరిగింది. ముందుగా తను అనుకున్న స్థాయిలో ఉద్యోగం ముందుగా పోలీస్ వ్యవస్థ పైన దృష్టి పెట్టి కానిస్టేబుల్ గా తన పట్టుదలతో ఉద్యోగం సాధించారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ ఆటు కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు కలవకుండగా ముందుకు వెళుతూ అలంపూర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న పరశురాముడు ఒక పేదింటి అమ్మాయిని వివాహం చేసుకొని కొన్ని నెలలుగా తన పట్టువదలని విక్రమార్కుడిలా గ్రూప్ వన్ పరీక్షలకు ప్రిపేర్ కావడం జరిగింది. అందులో భాగంగా గ్రూప్ వన్ కు సెలక్షన్ కావడంతో తన కుటుంబ సభ్యులు ఆశీర్వాదాలతో గ్రూప్ వన్ లో ర్యాంకు సాధించి ఎంపీడీవో గా సెలక్షన్ కావడం చాలా సంతోషకరమని వడ్డేపల్లి మండల ప్రజలు పైపాడు గ్రామస్తులు అలంపూర్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఉత్సవాలతో భక్తి శ్రద్ధలు పెంపొందించాలి : ఎస్పి



ఎస్పీని సన్మానిస్తున్న బిజెపి నాయకులు

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకుని ప్రజల్లో భక్తిని పెంపొందించేలా నిర్వహించాలని జిల్లా ఎస్పి యోగేష్ గౌతమ్ కోరారు. గురువారం నారాయణపేట పట్టణంలోని ఎస్ఎస్‌కె సమాజ్ మడి ఈశ్వర్ మందిర్‌లో దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ఎస్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. ఆదర్శంగా నిలుస్తు భక్తిని పెంపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పిని ఎస్ ఎస్‌కే సమాజ్ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ కే.సమాజ్ సిఎంసి సభ్యులు నందు నామాజీ, వినోద్ చౌద్రి, ప్రకాష్, స్థానిక సభ్యులు తిర్మల్, సుభాష్, విజయ్ నామాజీ, బాల్ రాజ్, రమేష్, శంకర్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాచీన ఆలయ అభివృద్ధికి కృషి : ఎంపి,ఎమ్మెల్యే



ఈరట్వాన్ పల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్

**ఉప్పునుంతల, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** ప్రాచీన కాలం నాటి ఆలయాలు నేటికీ ఆదరణ కోల్పోకుండా కొనసాగుతున్నాయని, వాటి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు డా. మల్లు రవి, టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని ఈరట్వాన్‌పల్లి గ్రామాన్ని సందర్శించి, గ్రామంలోని శతాబ్దాల నాటి రామాలయం, శివాలయాలను దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, ఎంపీ డా. మల్లు రవి, డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డిని పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.గ్రామంలో ప్రాచీన చరిత్ర కలిగిన ఈ ఆలయాలు సాంస్కృతిక సంపదకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. రామాలయం, శివాలయం రెండూ శిల్పకళా వైభవానికి అద్భుతమైన ఉదాహరణలుగా నిలుస్తున్నాయని, వాటిని తరతరాలుగా గ్రామ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో కాపాడుకుంటూ వస్తున్నారని పెద్దలు గుర్తుచేశారు. పూర్వం ఈ ఆలయాలు ఆధ్యాత్మిక కార్యకలాపాలకు ప్రధాన కేంద్రాలుగా ఉండి, ప్రాంత ప్రజల ఆత్మీయ బంధాలను బలపరిచేవని వారు వివరించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఎంపీ, ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్‌లు ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి ఎండోమెంట్ నిధులు కేటాయించాలని గ్రామ ప్రజలు కోరగా, వారు సానుకూలంగా స్పందించారు. పురాతన ఆలయాలు మన పూర్వీకుల సంస్కృతి, సంప్రదాయాల ప్రతీకలు. వాటి సంరక్షణ, అభివృద్ధి కోసం కృషి చేయడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అదేవిధంగా ఎంపీ డా. మల్లురవి ఆలయాల పునరుద్ధరణ, సౌకర్యాల కల్పన కోసం అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎంపి మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల ఇంఛార్జి అంతటి శేఖర్ గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మెడమోని భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, వెల్టూరు మాజీ సర్పంచ్ లింగమయ్య యాదవ్, శంకర్, రామచంద్రయ్య, శ్రీను రాజు, అంజి రాములు, నరసింహ గౌడ్, లచ్చయ్య, తిరుపతయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాము, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధికి 15 కోట్లు నిధులు మంజూరు పట్ల హర్షం



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు పాలాభిషేకం

**అమరచింత సెప్టెంబర్ 25, ప్రభాతవార్త;** రాష్ట్ర ప్రభుత్వం అమరచింత పట్టణ అభివృద్ధికి 15 కోట్ల నిధులు మంజూరు పట్ల గురువారం అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ కాన్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధి కోసం 15 కోట్ల నిధులు మంజూరయ్యాయని మున్సిపల్ కేంద్రంలోని సిసి రోడ్లు, డ్రైనేజీ, పార్కుల నిర్మాణంకోసం పనులు చేపడుతున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల అధ్యక్షులు, అరుణ్ కుమార్, కేజీ మహేందర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు విష్ణు, కమలాకర్ గౌడ్, రవికాంత్, శ్యాం కుమార్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు హనుమంతు నాయక్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, మాజీ ఎంపీటీసీలు, మహంకాళి విష్ణు, తిరుమలేష్, సోషల్ మీడియా ఇన్చార్జి తౌఫిక్, ఐఎన్‌టిసి మండల అధ్యక్షులు ప్రభుదాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాకేష్ గౌడ్, పోతు శ్రీధర్, వీరేష్ గౌడ్, పాషా, ఆంజనేయులు గౌడ్, కృష్ణ నాయక్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి,సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు ఆర్థికసహాయం అందించడం ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి అన్నారు.గురువారం ఆయా గ్రామాలకు సంబంధించిన కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యానికి అవసరమయ్యే ఆర్థిక సహాయం కోసం పేద ప్రజలు తనను సంప్రదించాలని సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని అన్నారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించడం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నదన్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్న వారు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ప్రధానం అని అందుకే, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించే బాధ్యత అధికారులదే చెప్పారు. ఎవరైనా పథకానికి దూరంగా ఉంటే, వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎలాంటి సమస్య వచ్చినా, మీ ఎమ్మెల్యేగా నేను మీకు అండగా ఉంటాను అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మిద్దెరాములు,పిఏసిఎస్ మాజీ చైర్మన్ వెంకట్ స్వామి,మాజీ సర్పంచులు అమృత్ రెడ్డి, తిరుపతయ్య, రామచందర్, అవంతి శంకర్, బంగారి పర్వతాలు,నరేందర్ గౌడ్, ఈశ్వర్, నజీర్ పాషా, రామ్ చందర్ నాయక్, మధుసూదన్ రెడ్డి తదితరులున్నారు.

## అమరచింత యూనియన్ బ్యాంక్ ఎదుట చేనేత కార్మికులు ధర్నా



యూనియన్ బ్యాంక్ ఎదుట చేనేత కార్మికులు ధర్నా

**అమరచింత సెప్టెంబర్ 25. ప్రభాతవార్త:** చేనేత కార్మికుల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ చేనేత కార్మికులు గురువారము అమరచింత బస్టాండులోని రాస్తారోకో నిర్వహించి నా అనంతరం అమరచింత యూనియన్ బ్యాంక్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం మాఫీ చేయకపోవడంతో చేనేత కార్మికులం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చేనేత కార్మికుల రుణమాఫీ విషయము యూనియన్ బ్యాంక్ అధికారులకు అనేకమార్లు విన్నవించిన కార్మికులకు నిరక్ష ్య సమాధానమిస్తున్నారని వారు అన్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ చేనేత కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని వారు అన్నారు. చరిత కార్మికులను దూషించిన మేనేజర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే చేనేత కార్మికుల అప్పులు ఉన్నారనే సాకుతో అకౌంట్లను లాక్ చేస్తున్నారని వెంటనే కార్మికుల అకౌంట్ లాక్ ను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల ఆందోళనకు మద్దతుగా బిజెపి మండల అధ్యక్షురాలు మంగ లావణ్య, క్యామ భాస్కర్, మరాటి అశోక్ కుమార్, వినోద్ కుమార్, టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అక్కల నరసింహులు గౌడ్, తెలుగు రమేష్, సిపిఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి, కే రాజన్న మద్దతుగా మాట్లాడారు.

## అంగన్‌వాడీ సిబ్బందిపై అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం



అంగన్‌వాడీలను అరెస్టు చేసిన పోలీసులు

**నారాయణపేట,సెప్టెంబరు25 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో తమ న్యాయమైన హక్కుల కోసం చలో హైదరాబాద్ కార్యక్ర మంలో పాల్గొనాలని నిర్ణయించుకున్న అంగన్‌వాడీ సిబ్బందిని పోలీసులు అర్ధరాత్రి వేళల్లో అక్రమంగా అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లాఅధ్యక్షులు వెంకట్రామిరెడ్డి జిల్లా కార్యదర్శి బల్ రామ్ అన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందడమే లక్ష్యంగా పోరాటం చేపడుతుంటే వారిని అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు పెద్ద ముప్పు అని వారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టే హక్కు ఉందని ఆ హక్కులను పోలీసు లు బలవంతంగా లాక్కోవడం అసహనీయమని వారు అభిప్రాయపడ్డారు. తెల్లవారుజామునే జిల్లా కేంద్రంలో అంగన్వాడీ యూనియన్ నాయకుల ఇళ్లను పోలీసులు ముట్టడి చేసి మహిళా కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం ప్రభుత్వం కార్మిక వర్గాలపై చూపుతున్న అసహనానికి నిదర్శనమని సీఐటీయూ నాయకులు అన్నారు ఇప్పటికే తక్కువ జీతాలు అధిక పనిభారం శాశ్వత ఉద్యోగ హామీ లేకుండా అంగన్‌వాడీలు కష్టాల్లో జీవిస్తుండగా తమ గళాన్ని వినిపించుకోవడానికి చేసిన ప్రయత్నాన్ని అణిచివేయడం నిరంకుశ పాలన అని వారు పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయడం రిటైర్మెంట్ భత్యం కల్పించడం పదోన్నతులు కల్పించడం వంటి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులను తక్షణమే విరమించుకోవాలని లేకపోతే ఆందోళనలకు దిగుతామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.

## ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వింధ్యా నాయక్

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట జిల్లా న్యా యసేవ లీగల్ సర్వీ సెస్ కార్య దర్శి, సీనియర్ సివిల్ జడ్జి వింధ్యా నాయక్ అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ వరల్డ్ బీఫ్ డే విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వింధ్య నాయక్ మాట్లాడుతూ ఆరో గ్యంపై జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరు తగిన జాగ్ర త్తలు తీసుకోవాలని అన్నా రు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉప యోగించడం ద్వారా, చెవిటి వారికి వారి జీవనశైలిని మార్చడానికి, మెరుగుప రచడానికి అవకాశా లు ఉన్నాయని అన్నారు. చెవిటి, మూగవాళ్లకు సంబందించిన డాక్టర్స్‌ను కలిసి సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. ఈ బధిరు ల హక్కులను, సంకేత భాష ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందన్నారు. వారికి విద్య, ఉపాధి, సామాజిక సమానత్వం కల్పించాలని , బధి రులు సమాజానికి ఎంత గానో తోడ్పడగలరని, వారిని ప్రోత్సహిం చాల్సి న అవసరం ఉందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ మూడు నెలల కు ఒకసారి తమ ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. మానసిక ఒత్తిళ్లను అధిగ మించేందుకు ప్రతీ రోజు క్రమం తప్పకుండా వ్యాయామం, యోగ వంటివి చేస్తే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. వ్యాధుల పట్ల అవ గాహనా, సామాన్య ప్రజలు ఏ విధంగా న్యాయం పొందాలని పలు చట్టాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ సంపత్ కుమార్, డాక్టర్లు ఆదిత్య, అమృత్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మి ్మపతి గౌడ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ నాగేశ్వరి, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పండిత్ దీన్ దయాల్ జయంతి



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**జడ్చర్ల సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ జడ్చర్ల మండల్ మాచారం గ్రామ అధ్యక్షులు తిరుపతి ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జన్మదిన సందర్భంగా పూలమాలలతో సత్కరించి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు యట రామకృష్ణ మండల ఉపాధ్యక్షులు మహేష్ యాదవ్ మండల ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్‌గౌడ్ మండల ఉపాధ్యక్షులు కాశన్న మండల యువమోర్చా అధ్యక్షులు కొండ గణపతిగుప్తా మోర్చా మండల అధ్యక్షులు మోహన్‌నాయక్ కృష్ణారెడ్డి రఘుసుధాకర్ ముదిరాజ్ రమేష్ గౌడ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాత్యాయని రూపంలో అమ్మవారు



పాలెంలో కాత్యాయని రూపంలో దుర్గామాత

**బిజినేపల్లి, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** నవరాత్రుల్లో నాలుగో రోజు అమ్మ అనుగ్రహించే కాత్యాయని రూపంలో దర్శనం ఇచ్చారు. చతుర్భుజాలతో, వరద, అభయ హస్తాలతో, ఖడ్గం, పద్మం ధరించి సింహ వాహనాన్ని అధిరోహించి భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారు బంగారు వర్ణంలో మెరిసిపోతూ దివ్యతేజస్సుతో కనిపించారు.

### మల్దకల్‌లో..



**మల్దకల్ సెప్టెంబర్ 25,ప్రభాతవార్త :** దసరా నవరాత్రి ఉత్సవాలు 4వ రోజు వైభవంగా జరుగుతున్నాయి. మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బుధవారం అమ్మవారిని శ్రీ కాత్యాయనిదేవిగా అలంకరించి ఆలయ అర్చకులు రమేష్ ఆచారి రవి చైతన్య ప్రద్యుమ్నులు విశేష పూజలు, లక్ష్మీ, సరస్వతి, కాత్యాయని హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.ఈసందర్భంగా అమ్మవారికి నివేదన చేశారు. గురువారం పూజా దాతలు ఇల్లూరి అశోక్ అండ్ సన్స్, ఆళ్లగడ్డ వెంకటేష్, కొల్లూరు సత్యనారాయణ అండ్ సన్స్, మనసాని వెంకటేష్ అండ్ సన్స్ దంపతులు పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో మహిళలు పాల్గొని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షులు నాగరాజు, పట్టణ అధ్యక్షులు బాదామి శ్రీనివాసులు, వ్యవస్థాపకులు మనసాని నాగరాజు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం తేదీ పొడిగింపు

**గద్వాల్ టౌన్ సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా నందు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కొరకు దరఖాస్తు తేదినీ నవంబర్ 19వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఎస్సీ అభ్యర్థులు వెబ్సైట్ నందు నవంబర్ 19వ తేదీ వరకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఈ అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రకటన ద్వారా కోరారు.

## ఉప్పునుంతలలో స్వచ్ఛతహీ సేవ కార్యక్రమం



ఉప్పునుంతలలో శ్రమదానం చేస్తున్న అధికారులు

**ఉప్పునుంతల, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రమైన ఉప్పునుంతల అంగన్‌వాడి కేంద్రం 2లో శ్రమదానం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎంపీడీఓ మోహన్‌లాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.అంగన్‌వాడి కేంద్రం పరిసరప్రాంతంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేశారు.ఈకార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు ఈజీఎస్ ఎపిఓ పర్వతాలు, ఐకెపి ఎపిఎం బాలచందర్,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బిపాసా, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, అంగన్‌వాడి కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన యువత



బిజెపిలో చేరిన యువతకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీకే సిగ్గా రెడ్డి

**ఇటిక్యాల సెప్టెంబర్ 25, ప్రభాతవార్త;** మండల పరిధిలోని సాతర్ల. శ నగపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్. బిఆర్ఎస్ పార్టీ నుండి బిజెపి పార్టీలో చేరినట్లు మండల బిజెపి పార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా ఆధ్వర్యంలో రెండు పార్టీలకు చెందిన దాదాపు 18 మంది యువకులు బిజెపి పార్టీలో చేరగా జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి డీకే సిగ్గారెడ్డి వారికి కండువాలు వేసి బిజెపి పార్టీలోకి ఆహ్వానించారు. బిజెపి పార్టీ నాయకులు మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్నా అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి 11సంవత్సరాల పాటుగ్రామీణ ప్రాంతాలలో ఏమి అభివృద్ధి జరిగినాకేంద్ర ప్రభుత్వం నిధులు90శాతం నిధులుఉన్నాయన్నారు. బిజెపి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో. బిజెపిపార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని సూచిం చారు. పార్టీల చేరిన వారిలో కాశన్న, ఆంజనేయులు, రాజు, శేషన్న, శాలు, కాళీ, వీరితోపాటు మరికొంత మంది ఉన్నారు.

## నేడు ఎన్మనగండ్ల కళాశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్

**నవాబుపేట, సెప్టెంబరు25 (ప్రభాతవార్త:** నేడు మండల పరిధిలోని ఎనుమనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్యామ్ లిషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బోర్డు ఆదేశం మేరకు శుక్రవారం ఉదయం 10:30 లకు విద్యార్థుల తల్లిదండ్రులు కచ్చితంగా హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్యామ్ లీషా మాట్లాడుతూ పరీక్షలు, విద్యార్థుల చదువు తీరును మెరుగుపరిచేందుకు తల్లిదండ్రుల పాత్ర కూడా అవసరమని, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, శిక్షణా ప్రమాణాలు, కాలేజీ అభివృద్ధికి సంబంధించిన పలుఅంశాలను చర్చించనున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై మరింత దృష్టి పెట్టి, వారిని రెగ్యులర్‌గా కాలేజీకి హాజరుకావడానికి ప్రోత్సహించాలనే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించి విద్యార్థుల భవిష్యత్తు కోసం మార్గదర్శకాలు సూచించి విలువలతో కూడిన విద్యను అభ్యసించడానికి మా ప్రభుత్వ కళాశాలలో అన్ని వసతులతో కూడిన చదువు అందిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలు సలహాలు ఇచ్చి వారి ఆలోచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థుల కోసం వారి తల్లిదండ్రులు ఈ మీటింగ్‌కు తప్పకుండా హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపల్ శ్యామ్ లీషా అన్నారు.

## నేటి గాయకులకు స్ఫూర్తిదాయకం ఎస్పి బాలు

### ఎస్పీ బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి



ఎస్పీ బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 25 (ప్రభాతవార్త:** నేటి గాయకులకు స్ఫూర్తి దాయకం ఎస్పి బాలు అని 18 భాషల్లో 45 వేలకు పైగా గీతాలను ఆలపించి పాడుతా తీయగా కార్యక్రమాన్ని తన భుజస్కాందాలపై వేసుకొని ఎందరో చిన్నారుల్లో దాగి ఉన్నా కళలను వెలికి తీసి ప్రోత్సహించిన మహోన్నత గాయకుడని అయన మరణం కళాకారులకు తీరని లోటని ఎస్పి బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం బాలకేంద్రంలో ఎస్పి బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించి ఆయన ఆత్మ శాంతికి 2 నిమిషాలు మౌనం పాటించి బాలు పాటలను ఆలపించారు. సంగ నర్సింహులు, వసంత్ కుమార్, అథ్లెటిక్స్ కోచ్ హారిక పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపు మధ్యతరగతి, పేదలకు లాభం

**ఊట్కూర్, సెప్టెంబరు 25 (ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం కోసం జీఎస్టీలో సమూల మార్పులు చేపట్టినట్లు భాజపా సీనియర్ నాయకుడు బిజ్వార్ మహేష్‌గౌడ్ తెలిపారు. గతంలో ఉన్న నాలుగు స్లాబ్‌లను రెండు స్లాబ్‌లుగా తగ్గించడం, మరియు సామాన్య ప్రజలకు ఉపయోగపడే వస్తువులపై టాక్సీలను తొలగించడం ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. కొన్ని వస్తువులపై 5శాతం జీఎస్టీ అమలు చేయడం ద్వారా పేదలకు, రైతులు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్ష లాభం ఉంటుందని గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణలో 3.25 కోట్ల మంది ఈ మార్పుల ద్వారా ప్రయోజనం పొందుతారని, కేంద్రానికి రూ.35-40 వేల కోట్లు ఆదా అవుతుందని ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో పార్లమెంట్ ద్వారా తీసుకున్న నిర్ణయాలతో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నట్లు మహేష్ గౌడ్ చెప్పారు. జీఎస్టీ తగ్గింపుకు పట్లకొన్ని పార్టీలు రాజకీయ రాద్ధాంతం చేస్తున్నట్లు, రాష్ట్రాల ఆదాయం తగ్గుతుందని అసహ్యంగా ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇతర ముఖ్య అంశాల్లో, ఇండ్ల నిర్మాణ, వ్యవసాయ సామాగ్రి ధరల తగ్గింపు ద్వారా పేదలు, రైతులు నేరుగా లాభపడు తారని, ప్రపంచ ఆర్థిక మాంద్యం నేపథ్యంలో పేదల సంక్షేమం కోసం ధరలు తగ్గించడం అభినందనీయమని మహేష్ గౌడ్ అన్నారు. చివరగా, జీఎస్టీ ద్వారా లభించే ప్రయోజనాలను భాజపా కార్యకర్తలు, వ్యాపారవేత్తలు, ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు.

## పేట పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా ఉంచడం కోసం అందరూ సహకరించాలి

### ◆ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య



**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 25 (ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణం స్వచ్ఛ పట్టణంగా ఉండడం కోసం అందరి సహకారంతోనే సాహిత్యమని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశను సారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం లో భాగంగా పట్టణంలోని స్థానిక వివేకానంద పార్క్‌లో ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కులు, చుట్టుపక్కల ఉన్న పరిసర ప్రాంతాలోని చెత్తను స్థానిక మార్నింగ్ వాకర్స్‌తో శుభ్రపరిచారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య మాట్లాడుతూ సంవత్సరంలో రోజుకు రెండు గంటల స్వచ్ఛందంగా పరిసరాలు పరిశుభ్రత పరుచుటకు ముందుకు రావాలన్నారు. నారాయణపేట పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా ఉంచడంలో ప్రతి ఒక్కరిసహకారంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్, మార్నింగ్ వాల్కర్స్, బ్యాంకు సిబ్బంది పురపాలక సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.

## శక్తిపీఠంలో కొనసాగుతున్న శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు25 (ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సంత్ మఠ మూల మహా సంస్థానం, శక్తిపీఠం ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో నాలుగవ శక్తి పీఠం అమ్మవారు కాత్యాయని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో భక్తులతో పాటు ప్రముఖ తెలుగు సీరియల్, సినీ నటకుమారి దుర్గ పేట శక్తి పీఠంను దర్శించుకుని బ్రహ్మోత్సవాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమంలో పాల్గొన్నారు. సాయంత్రం జ్ఞాన యజ్ఞంలో భాగంగా జరిగిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో పూజ్య డా. స్వామి శాంతానంద పురోహిత్ భక్తులనుద్దేశించి ప్రవచనం చేశారు. అనంతరం భక్తులకు భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమాలలో శక్తి పీఠం ట్రస్ట్ సభ్యులు ఉట్కూర్ విభావసు పురోహిత్, దోమ సుధాకర్, నంది రాజశేఖర్, కర్నెగంగాధర్ రెడ్డి తదితర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒక్కటీ పెండింగ్ ఉండొద్దు

(మొదటి పేజీ తరువాయి)

విజయేందిర బోయి ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తహశీల్దార్ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, భూభారతిలో వచ్చినఅప్లికేషన్లను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, రిజెక్ట్ అయిన అప్లికేషన్లు, పరిష్కరించిన అప్లికేషన్లు, పెండింగ్లో ఉన్న అప్లికేషన్ల వివరాలను మండలాల వారీగా జిల్లా కలెక్టర్ సంబంధిత మండల తహశీల్దార్ లను అడిగి తెలుసుకున్నారు. ఏ ఒక్క అప్లికేషన్ ను పెండింగ్ లో పెట్టకుండా వెంటనే పూర్తి చేయాలని తహశీల్దార్ లను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్.డి.ఓ. నవీన్, సర్వే అండ్ ల్యాండ్ సహాయ సంచాలకులు కిషన్ రావు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ కూలీలందరికీ

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సలీం



మాట్లాడుతున్న ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఎ.సలీం

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 25 (ప్రభాతవార్త:** వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి రూ.12 వేలు వెంటనే ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఎ.సలీం, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యాలయంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ జనవరి 26, 2025న ఆత్మీయభరోసాను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. రెండు దఫాలుగా 6000 ఖరీఫ్ సీజన్ వారిగా ఇస్తామన్నారు. ఆరు నెలలు పూర్తయింది ఖరీఫ్ సీజన్ వచ్చింది. 6000 వేలురూపాయలు రాలేదు. రాష్ట్రంలో భూమిని వ్యవసాయ కూలీలకు రూ.5,19,191 మాత్రమే గుర్తించింది. వారికి 311 కోట్లు ఖర్చు అవుతుంది. కానీ ఇచ్చింది 83,887 మంది కూలీలకు 53 కోట్లు మాత్రమే మొత్తంలో ఆరవ వంతు మాత్రమే కూలీలకు ఇచ్చి తప్పుకున్నారు. ఇంకా వ్యవసాయ పనుల్లో పనిచేస్తున్న వారు 4,35,304 మందికి కూలీలకు 6000 వేలు ఇవ్వలేదు. 20 రోజులు ఎన్ఆర్ఈజీఎస్ పని చేసిన వారై ఉండాలని నిబంధన పెట్టారు. ఈ నిబంధన వల్ల భూమిలేని వ్యవసాయ కూలీలందరికీ 6000 వేలు రాలేదు. వ్యవసాయ కూలీలకు ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ పనులకు పోలేని పరిస్థితి ఉన్నది అన్నారు. గ్రామాల్లో ఖచ్చితమైన పనులుదొరకకపోవడం వల్ల వర్షాకాలం సీజన్ తర్వాత వారు పట్టణాలకు వలసవెళ్తారు. ఉపాధి హామీలో 100 రోజులు మాత్రమే పని దొరుకుతుంది. చేసిన పని దినాలలో రోజులు 150 నుండి 230మాత్రమే తక్కువకూలి గిట్టుబాటు కావడంలేదు. 20 రోజులు కూడా పనికి పోలేని స్థితి ఉంది అన్నారు. ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిబంధన వల్ల భూమిలేని వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసానే అమలు కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం 17 లక్షల మంది వ్యవసాయ కూలీలు ఉన్నారని అంచన వేసి 15,19,191 మందికి కుదించారు. అమల్లో 188,887 మందికి మాత్రమే 6000 వేలు చెల్లించారు. 17 లక్షల మందికి ఇచ్చిన 2 వేలకోట్లు అవుతుంది ఇది ప్రభుత్వానికి భారం కాదు. ఇదే కాకుండా రాష్ట్రంలో 1 ఎకరం ఉన్న వాళ్ల 24.22 లక్షల మంది రెండు ఎకరాలు వరకు ఉన్న 17.2 లక్షల మంది కూలిలు ఏడాది పొడవున కూలిపైన ఆధారపడి, జీవనం బ్రతకడానికి వేరే ఆదాయ పనులు లేవు బ్రతుకు లీడుస్తున్నారు. ఇట్టి వ్యవసాయ కూలీలకు పథకం వర్తింపజేయాలి. చేనేత బీడీ గీత కార్మికులకు 2000 పెన్షన్ ఇచ్చే విధంగా వ్యవసాయ కూలీలందరికీ ఇవ్వాలి. రేవంత్ రెడ్డి హామీ ప్రకారంగా 4వేలకు పెన్షన్ ఏడాదికి 48వేల రూపాయలు ఇవ్వాలని, వారు ఎన్నికల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు జి.వెంకట్ రాములు, చెన్నప్ప, జిల్లా సహాయ కార్యదర్శి కనకరాయుడు, జిల్లా కోశాధికారి హాజీ మలంగ్, జిల్లా నాయకులు వై.రాజు, వి.రాములు, కె.మల్లేష్, వెంకటయ్య, కె.కృష్ణ, హనుమంతుతో పాటు తదితరులు ఉన్నారు.

## గ్రంథాలయాలు జ్ఞాన కేంద్రాలు

### ◆ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



ప్రారంభించిన గ్రంథాలయంలో పుస్తకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**చిన్నచింతకుంట, సెప్టెంబరు25 (ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం ధమగ్నాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ సమీపంలో మినీ గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని అన్ని మండల కేంద్రాల్లోని గ్రంథాలయాలను మరింత మెరుగు పరిచాల్సిన అవసరం ఉందని, అక్కడ పాఠకులకు తగ్గట్టుగా సౌకర్యవంతంగా ఉండే విధంగా ఉండే విధంగా చూడాలని సంబంధిత చైర్మన్‌కు ఆయన సూచించారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని కూడా మరిన్ని నిధులతో ఆధునీకరిస్తే అక్కడి పాఠకులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని, అందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, ,పిఎసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కురుమూర్తి ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, గ్రామ కార్యదర్శి నవీన్ కుమార్, చిన్న చింతకుంట గ్రంథాలయ నిర్వాకులు చంద్రన్న, నాయకులు, బాలకృష్ణారెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, రవిగౌడ్, ఎద్దుల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించిన జిల్లా ఎస్పీ



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎస్పీ

**అలంపూర్ సెప్టెంబర్25, ప్రభాతవార్త:** అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం రోజు జోగులాంబ దేవి అమ్మవారికి బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లకు జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పట్టువస్త్రాలను ఆలయ ఈఓ.కు అందజేశారు. ముందుగా జిల్లా కే. శ్రీనివాసరావుకు ఆలయ ఓ అర్చకులు పునగుమంతో స్వాగతం పలికారు. బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, జోగులాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా ఎస్పీ ఆలయ అర్చకులకు పట్టు వస్త్రాలను అమ్మవారికి అందజేశారు. జిల్లా ఎస్పీ దంపతులకు ఆలయ అర్చకులు ఈవో సన్మానం చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ ఆలయాలకు వస్తున్న భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా బందోబస్తును ఏర్పాట్లపై అలంపూర్ ఎస్సై వెంకటస్వామితో చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని అలంపూర్ ఆదేశాలు జారీ చేశారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలు

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు25 (ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ నారాయణపేట డిపో ఆవరణలో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగు పూలతో బతుకమ్మను తయారుచేసి మహిళా ఉద్యోగులు ఆటపాటలతో ఆడుతూ పాడుతూ ఆనందోస్తాల మధ్య బతుకమ్మ కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపోమేనేజర్ లావణ్య, ట్రాఫిక్ సూపర్‌వైజర్ శ్రీశైలమ్మ, మహిళా ఉద్యోగులు శ్రీలక్ష్మి, భాగ్యమ్మ, సుగుణమ్మ, భీమమ్మ, శ్వేత, పుష్పలత, సరోజ, భార్గవితో బాటు తదితరులు ఉన్నారు.

## గోడ పత్రిక విడుదల



గోడ పత్రిక విడుదల చేస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

**ఉప్పునుంతల, సెప్టెంబరు 25 (ప్రభాతవార్త :** తెలంగాణ జాతిపిత కొండాలక్ష్మణ్ బాపూజీ 110వజయంతి ఉత్సవాలు సామాజిక తెలంగాణ వారోత్సవాల్లో భాగంగా అచ్చంపేట నియోజకవర్గంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు కోట కిషోర్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాలక్ష్మణ్ బాపూజీ నిబద్ధతను ఆయన పోరాట పటిమను కొనియాడారు. భవిష్యత్తు తరాలకు బాపూజీ చరిత్రను పూర్తి పొందేలా ట్యాంక్ బండ్ పై బాపూజీ విగ్రహం వద్ద జరిగే సామాజిక తెలంగాణ ఉత్సవాల్లో భారీ ఎత్తున పాల్గొనాలని కోరుతూ కార్యక్రమం నిర్వహించారు. ఈ గోడ పత్రిక విడుదలచేసిన వారిలో శివాలయం అధ్యక్షుడు వనం పర్వతాలు, మహిళా సంఘం అధ్యక్షురాలు దాస పత్రి శకుంతల, దాసు శ్రీనివాసులు, కర్నాటి రాములు, వనం గీత, హైమావతి, ప్రశాంతి, సత్యనారాయణ, వేణు, నరసింహ, రమేష్, భాను ప్రసాద్, రవి కుమార్, నరేందర్ లోకేశ్ లు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు ఆత్మకూరు విద్యార్థుల ఎంపిక

**ఆత్మకూర్ సెప్టెంబర్25, ప్రభాతవార్త;** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్య కొనసాగిస్తున్న విద్యార్థినిలు అనిత, కీర్తి తదితరులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లుగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుని సంతోషి విలేకరులకు తెలిపారు. గత 15 రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న మండల, జిల్లాస్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నేపథ్యంలో నిజామాబాదులో జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడలకు ఆత్మకూర్ కు చెందిన విద్యార్థినిలు ఎంపిక కావడం పట్ల మండల విద్యాధికారి బాలరాజు, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, తదితరులు విద్యార్థినిలతో పాటుగా పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

## ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి



వావిలాల శనగపల్లి రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గ్రామ నాయకులు

**ఇటిక్యాల సెప్టెంబర్25, ప్రభాతవార్త;** మండల పరిధిలోని వావిలాల గ్రామంలో నుండి శనగపల్లి గ్రామం వరకు దాదాపు 5 కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డు గుంతల మయంగా మారి పోయిందని ఈ రోడ్డుకు మట్టి రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలనివావిలాల గ్రామ తాజా మాజీ ఎంపిటిసి లతాచంద్రగౌడ్, డీకే శివశంకర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడుకు వినతి పత్రం ఇచ్చారు. వినతి పత్రంలో వావిలాల గ్రామం నుండి శనగపల్లి గ్రామంవరకు నిన్న రోడ్డు పూర్తిగా పాడైపోయి గుంతల మయంగా మారడంతో గుంతలలో వర్షపు నీరు చేరి జలమయంగా మారిపోవడంతో ఈ రోడ్డుపై ప్రయాణించే ఆటోలు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ఆస్పత్రులలో చికిత్సలు పొందుతారని నిత్యం వాహనదారులు రైతులు ఈ రోడ్డుపై ప్రయాణిస్తుండగా ఇబ్బందులకు గురవుతున్నారని వ్యవసాయ సీజన్ కాలంలో రైతులు మరింత ఇబ్బందులు పడతారని పాడైపోయిన ఈ రోడ్డుకు మట్టి రోడ్డును పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ఎమ్మెల్సీ చల్లవెంకట్రామిరెడ్డి, అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడుకు వారు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి గుంతల మయంగా మారినరోడ్డుకు మట్టి రోడ్డును వేసేందుకు నిధులు మంజూరు చేస్తామని నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాగర్ దొడ్డి వెంకట, రాములు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

**ఊట్కూర్, సెప్టెంబరు 25 (ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల పరిధిలోని అమీన్పూర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి డా.వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు భూమి పూజ నిర్వహించారు. ఊట్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకులు మండల అధ్యక్షుడు విగ్నేశ్వర్ రెడ్డి, యువజన అధ్యక్షుడు మహేష్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు కొక్కు లింగం, పిఏసిఎస్ చైర్మన్ బాల్ రెడ్డి, బసవరాజ్ గౌడ్, అమీన్పూర్ మాజీ సర్పంచ్ సరోజనమ్మ, మాజీ ఎంపిటిసి శేఖర్ రెడ్డి, షఫీ, మక్బూల్‌తో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. గ్రామపంచాయతీ నిధులతో సుమారు రూ.20 లక్షల వ్యయంతో ఈ భవనం నిర్మాణం చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు.



గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

## తదుపరి మెరిట్ అభ్యర్థులతో గురుకుల ఉద్యోగాలు భర్తీ కావాలి

**ఊట్కూర్, సెప్టెంబరు 25 (ప్రభాతవార్త:** తెలంగాణ గురుకుల నియామక సంస్థ 2023లో వివిధ గురుకులాల్లో ఉపాధ్యాయ, ఇతర ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే అవరోహణ క్రమంలో ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం వల్ల అభ్యర్థులకు ఏ ఉద్యోగం దక్కుతుందో స్పష్టత రాలేదు. కొందరు అభ్యర్థులు ముందుగా చిన్న ఉద్యోగంలో చేరి, తరువాత పెద్ద ఉద్యోగం అందితే దానికి వెళ్లడం జరిగింది. ఇలా అవ్వడంతో సుమారు 2,500 పోస్టులు బ్యాక్‌లాగ్ అయ్యాయి. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని 600 మంది అభ్యర్థులు రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ సమర్పించారు. నిన్న హైకోర్టు తదుపరి గురుకుల ఉద్యోగాలను పిటిషనర్ అభ్యర్థులతో భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కేవలం పిటిషనర్ అభ్యర్థులతో భర్తీ చేస్తే మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని భావిస్తూ, హెచ్.నర్సింహా, డీ.ఇడీ, బీ.ఇడీ, విద్యావంతులు దొరోల్ల కృష్ణయ్య, సూర్యకాంత్, ఉప్పు ఆంజనేయులు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వారు కోరిన విధంగా, ఉద్యోగాలను 1:2 నిష్పత్తిలో తదుపరి మెరిట్ అభ్యర్థులతో కూడా భర్తీ చేయాలని అభ్యర్థించారు.

## ఆర్టీసీ డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో లక్కీడ్రా

**నారాయణ పేట, సెప్టెంబరు 25 (ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణం మరియు పరిసర గ్రామాల ప్రజలకు ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య తెలియజేసిన ప్రకారం ఆర్టీసీ డీలక్స్ సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే వారికి ప్రత్యేక లక్కీ డ్రా కార్యక్రమం నిర్వహించబడుతోంది. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 6 వరకు ప్రయాణించిన వారు తమ టికెట్ వెనుక పేరు ఫోన్ నంబరు చిరునామా రాసి బస్టాండులో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా బాక్సుల్లో వేయవలసి ఉంటుంది వచ్చే నెల 8న రీజియన్ స్థాయిలో లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారు. మొదటి బహుమతి రూ.25,000రెండో బహుమతి రూ.15,000 మూడో బహుమతి రూ.10,000జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అలాగే దసరా సందర్భంగా డిపో నుంచి ప్రత్యేక బస్సులు హైదరాబాద్ నారాయణపేట రూట్‌లో దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్‌తెలిపారు. సెప్టెంబర్ 27నుంచి అక్టోబర్ 1వరకు హైదరాబాద్ నుంచి నారాయణపేటకు అక్టోబర్ 5-6 తేదీల్లో నారాయణ పేట నుంచి హైదరాబాద్‌కు బస్సులు నడపబడనున్నాయి.

## జిల్లా శాఖ అధ్యక్షుడిగా వెంకటరామిరెడ్డి

**నారాయణపేట, సెప్టెంబరు 25 (ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా శాఖ అధ్యక్షుడిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వెంకట్ రామ్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు భత్తిని సుదర్శన్ చేతుల మీదుగా ధృవపత్రం స్వీకరించారు. అలాగే జిల్లా కార్యదర్శిగా చంద్రకాంత్‌రెడ్డి, కోశాధికారిగా తుల్జరామ్ ఎంపిక య్యారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ ఎన్నికలు నిర్వహించారు.

## ఊరూరా స్వచ్ఛతా హి సేవ

**బిజినేపల్లి, సెప్టెంబరు 25 (ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. అన్ని గ్రామాల్లో ఇందుకు సంబంధించిన అవగాహనార్యాలీలను అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీల సిబ్బంది స్వచ్ఛంద సేవా సంస్థలు కలిసి నిర్వహించారు. పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవడమే మనం సమాజానికి చేసే సేవ అని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు, యువజన సంఘాల సభ్యులు శ్రమదానం నిర్వహించారు.

**అలంపూర్ సెప్టెంబర్25, ప్రభాతవార్త :** ఆలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయం దగ్గర స్వచ్ఛతహి సేవ, 2025 కార్యక్రమంలో భాగంగా ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు నిర్వహించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ నారాయణ, మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## జిఓ నంబర్ 28ను రద్దు చేయాలి

### రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి

**లింగాల, సెప్టెంబ్ర 25 (ప్రభాతవార్త:** జిఓ నంబర్ 28ను రద్దు చేయాలని కోరుతూ గురువారం లింగాల మండల కేంద్రంలో నాగర్‌కర్నూలు ఎంపీ డా.మల్లురవికి తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్రకోశాధికారి సనాతన బాలస్వామి ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పుడు సిపిఎస్ విధానం రద్దు చేసే అవకాశం ఉన్నప్పటికీ జిఓ నంబర్ 28ద్వారా తిరిగి సిపిఎస్‌నుఅడాప్ట్ చేయడంజరిగిందని తెలిపారు. అందులో దాదాపుగా రెండు లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు సిపిఎస్ బారిన పడ్డారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిఓ నంబర్28ను రద్దు చేయాలని, చనిపోయిన సిపిఎస్ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సందీప్ పులిజ్వాల, పచ్చిపాల సుదర్శన్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ సిబ్బంది నిరక్ష్యం..

### ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

**కృష్ణ, సెప్టెంబరు 25 (ప్రభాతవార్త:** గమ్యస్థానానికి చేరాల్సిన బస్సు మధ్య గ్రామాల్లోనే ఆపి ముందున్న ప్రయాణికులను దింపి పంపిస్తున్న ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యానికి ప్రయాణికులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల నుంచి కుసుమూర్తి నుంచి క్రిష్ణామీదుగా ఆత్మకూరుకు అక్కడ నుంచి తిరగా తంగడిగి మీదుగా కుసుమూర్తి వరకు వెళ్లే బస్సు గత మూడు రోజుల నుంచి కృష్ణలోని ఆర్టీసీ సిబ్బంది ఆపి తంగడిగి, కుసుమూర్తి, అయిన పూర్, సుకర్ లింగంపల్లి వరకు వెళ్లే ప్రయాణికులను దింపి పంపిస్తున్నారని, దీంతో ఆగ్రహం చెందిన ప్రయాణికులు ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానం చెప్పి నవరాత్రి వరకు బస్సు నడపలేమని సమాధానంఇస్తున్నారని ఆయాగ్రామాల ప్రయాణికులు చెప్తున్నారు. అయితే సుదూర ప్రాంతంలో ఉన్న గ్రామాలకు బస్సులు నడిపించాలని కొట్లాడి స్థానిక మంత్రి, అధికారులకు విన్నవించి తెచ్చుకున్న బస్సు రాకపోతే ఎలా అని ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే సంబంధిత ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని తంగడిగి, కుసుమూర్తి గ్రామాల వరకు బస్సును నడిపించాలని లేనియెడల పెద్ద ఎత్తున రోడ్డుపై రాస్తారోకో, ఆందోళన చేపడతామని అన్నారు.

### వికలాంగుల, చేయూత పింఛనుదారుల సన్నాహక సదస్సు

**మక్తల్‌టౌన్, సెప్టెంబరు25 (ప్రభాతవార్త:** వికలాంగులు చేయూత పింఛను పెరుగుదలకై మక్తల్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6000లువృద్ధులకు ఒంటరి మహిళలకు ,గీత,నేత బీడీ కార్మికులకు రూ.4000ల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారితోపాటు కందరాల క్షీణత కలిగిన వారికి రూ.15 వేల సహాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నో రోజులుగాకొత్త పింఛన్లురాక ప్రజలు లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని వాటిని వెంటనే మంజూరు చేసి ప్రజలను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మక్తల్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు గోలపల్లి జ్ఞాన ప్రకాష్, జీర్గల నాగేష్, పి.హనుమంతు, గుడిసెవెంకటయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు వివిధ మండలాల జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.